అస్థికలు కలిపేందుకు వెళుతుండగా..



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ప్రైవేట్ బస్సు డ్రైవర్ వగిల్ల మల్లయ్య(50) దుర్మరణం చెందగా, మరో 25మందికి తీవ్రగాయాలయ్యాయి. IIలో

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని, ఉద్యోగులు ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలంటూ రీజినల్ మేనేజర్ యస్.సుదర్శన్ అన్నారు. శుక్రవారం మెదక్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల కండక్టర్లకు నైపుణ్యం పెంపు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ బస్సు ప్రయాణ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఆర్ఎం సూచించారు.

ఒకరికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 17 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 16 మందికి చేసినట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

చెవిలో పువ్వులు పెట్టుకొని..



కోహీర్ ఎంపీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు

కోహీర్(జహీరాబాద్): ఐకేపీ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఐదో రోజు శుక్రవారం వీఓఏలు చెవిలో పువ్వులు పెట్టుకొని, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. న్యాయమైన తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి న్యాయసలహా కేంద్రాలు



వ్యవసాయ న్యాయసలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి ప్రియాంక సిరిసిల్లా

నారాయణఖేడ్: రైతుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేందుకు వ్యవసాయ న్యాయసలహా కేంద్రాలు దోహదపడతాయని నారాయణఖేడ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రియాంక సిరిసిల్లా అన్నారు. నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని రైతువేదికలో శుక్రవారం వ్యవసాయ న్యాయసలహా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలతో పాటు మరే విషయాలలోనైనా అన్యాయం జరిగితే న్యాయసలహా కేంద్రంలో రైతులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయసలహా కేంద్రంలో వీఎల్‌పీ ద్వారా సమస్యలకు త్వరగా పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు న్యాయసలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆనంద్ స్వరూప్ శెట్కార్, మారుతిరెడ్డి, జూకల్ సర్పంచ్ సంగమ్మ, ఏఈవోలు ప్రశాంత్, రాందాస్ పాల్గొన్నారు.

మహాత్మా బసవేశ్వర జయంతిని జయప్రదం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ఈనెల 23వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతిని జయప్రదం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం అన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

అక్కడక్కడ అకాల వర్షాలు

కోహీర్(జహీరాబాద్): మండలంలో శుక్రవారం సాయంత్రం చిరుజల్లు కురిసింది. మధ్యాహ్నం ఎండ వేడికి తల్లడిల్లిన ప్రజలు సాయంత్రం కురిసిన జల్లులకు సేదతీరారు. వర్షపు జల్లులకు తోడు ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మండలంలోని మనియార్‌పల్లి, బిలాల్‌పూర్, బడంపేట, గొడిగార్‌పల్లి గ్రామాల పరిసర ప్రాంతాల్లో మామిడి కాలు నేలరాలి నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలంలో శుక్రవారం రాత్రి 2.8 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. దీంతో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అర్ధరాత్రి కరెంటు లేకపోవడంతో ఆయా గ్రామాలు అంధకారంలో ఉన్నాయి.

మునిపల్లి(అందోల్): మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. బలమైన ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కోహీర్(జహీరాబాద్): మనియార్‌పల్లిలో నేలరాలిన మామిడికాయలు

బాక్స్ క్రికెట్ క్రేజీ

- పట్టణాలలో వెలుస్తున్న బాక్స్ క్రికెట్ కేంద్రాలు
- రాత్రి వేళ వెలుతురు కోసం ఫ్లడ్‌లైట్‌ల ఏర్పాటు
- ఆసక్తి చూపుతున్న యువత



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కొండాపూర్(సంగారెడ్డి): గతంలో గ్రామాలలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఆటలు ఆడేవారు. గోలీలు, కర్రాబిళ్ల, కబడ్డీ, రన్నింగ్, జంపింగ్ వంటి ఆటలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వస్తే చాలు పుస్తకాలు పక్కనపెట్టి పిల్లలు ఆటలు ఆడుకునే వారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా స్మార్ట్‌ఫోన్ అందుబాటులో వచ్చింది. ప్రతీ పిల్లవాడి చేతిలో ఫోన్ ఉండాల్సిందే. యూ ట్యూబ్ చూడటం, ఫోన్‌లోనే ఆటలు ఆడడమే తప్ప శరీరానికి ఉపయోడపడే ఆటలు ఆడటం మరచిపోయారు. ఇప్పుడు ఎక్కడా చూసిన క్రికెట్.. క్రికెట్. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు క్రికెట్‌పై ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. క్రికెట్‌తో పాటు ఇండోర్ గేమ్‌లకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. యువత రాత్రి వేళ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో క్రికెట్ ఆడుతున్నారు. ఇప్పుడు సంగారెడ్డిలోనూ యువత, చిన్నారులకు క్రికెట్‌పై ఇష్టాన్ని పెంచేందుకు బాక్స్ క్రికెట్ కేంద్రాలు వెలుస్తున్నాయి.

- ప్రస్తుతం వేసవి కావడం, పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో ఇప్పడూ ఎక్కడ చూసిన క్రికెట్ సందడి నెలకొంది.
- గతంలో మండే ఎండలు ఉన్నా సరే క్రికెట్‌పై ఉన్న మక్కువతో బ్యాట్‌ను పట్టుకొని గ్రౌండ్‌కు వెళ్లేవారు. ఇదే కాకుండా వేసవి వచ్చిందటే చాలు గతంలో చిన్న చిన్న గ్రామాలలోనూ క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహించే వారు.
- ప్రస్తుతం పరిస్థితులు మారాయి. గతంలో కేవలం ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆడే మ్యాచ్‌లను టీవీలో చూసేవారు. విశేషాలను పేపర్‌లో చదివే వారు. ఇప్పుడు చిన్నచిన్న నగరాలలోనూ ఫ్లడ్‌లైట్ల బాక్స్ క్రికెట్ కేంద్రాలు ప్రారంభమయ్యాయి.
- దీంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను సాయంత్రం వేళలలో కోచింగ్ ఇప్పించేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఉద్యోగులు తమ పిల్లలకు క్రికెట్ శిక్షణ ఇప్పించేందుకు సమయం వెచ్చిస్తున్నారు.
- జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోనూ క్రికెట్‌లో ప్రత్యేకంగా కోచింగ్ ఇచ్చేందుకు నెట్ ప్రాక్టీస్‌కు శ్రీకారం చుట్టారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కేవలం సాయంత్రం వేళలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మాత్రమే కోచింగ్ ఇస్తున్నారు.
- సంగారెడ్డిలో క్రికెట్ కాకుండా స్నూకర్, షటిల్ ఆడేందుకు ప్రత్యేకంగా నెట్ ప్రాక్టీస్ కేంద్రాలను నెలకొల్పారు. ఒకేసారి ఒక క్రికెట్ టీం (12) మంది ఆడేందుకు వీలుగా గ్రౌండ్‌ను ఏర్పాటు చేశారు.
- వేసవిలో ఈ ప్రాక్టీస్ కేంద్రాల్లో సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కోచింగ్ ఇస్తున్నారు. క్రికెట్ ఆడుకునేవారి కోసం రాత్రి వేళలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ప్రాక్టీస్ చేసుకునేందుకు సాయంత్రం 7 గంటల నుంచి 11 గంటల వరకు అవకాశం కల్పిస్తున్నారు. ఇలా ఒక జట్టుకు గంటకు రూ.800 చెల్లిస్తున్నారు.
- ఒక్కో క్రీడాకారుడికి గంటకు రూ.150 తీసుకొని ఆడుకునే అవకాశం కల్పిస్తున్నారు. వీకెండ్‌లో ఉద్యోగులు మైదానానికి వచ్చి రెండు జట్లుగా విడిపోయి పోటీలు నిర్వహించుకుంటూ రోజంతా సరదాగా గడిపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.
- సంగారెడ్డినే కాకుండా చుట్టూపక్కల గ్రామాల యువత, వీకెండ్‌లో నర్సాపూర్, శివ్వంపేట, మల్కాపూర్ తదితర గ్రామాల నుంచి క్రీడాకారులు, డాక్టర్‌లు, ఉద్యోగులు క్రికెట్ ఆడుతున్నారు.

చిన్నప్పటి నుంచి క్రికెట్ ఇష్టం



చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. ఉపాధి కోసం రోజంతా ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నా. క్రికెట్ ఆడటం వీలు కాదనుకున్నా. కానీ, సంగారెడ్డిలో బాక్స్ క్రికెట్ స్టేడియం ఏర్పాడు చేయడం చాలా సంతోషంగా ఉంది. రాత్రి వేళలో బాక్స్‌లో క్రికెట్ ఆడుతున్నా. రాత్రి వేళలో క్రికెట్ ఆడుకునేందుకు ఫడ్ లైట్లను ఏర్పాటు చేశారు.

– రాకేష్, క్రికెట్ క్రీడాకారుడు

వీకెండ్‌లో హైదరాబాద్ వెళ్లి..

ప్రస్తుతం బాక్స్ క్రికెట్ ట్రెండింగ్‌లో ఉంది. క్రికెట్ మీద ఉన్న ప్రేమతో సంగారెడ్డిలో ఉన్న యువకులు వీకెండ్‌లో హైదరాబాద్ వెళ్లి ఆడేవారు. బాక్స్ క్రికెట్‌తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. బాక్స్ క్రికెట్ ఆడటం వల్ల క్రీడాకారులకు సౌకర్యంగా ఉంటుంది. క్రికెట్ ఆడేందుకు పిచ్‌పై మ్యాట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాం.

– సౌమ్య, నిర్వాహకురాలు

కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్

కొండాపూర్(సంగారెడ్డి): ధరణిలోని ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసి కొత్త పాస్ పుస్తకాలను ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొండాపూర్ మండల పరిధిలోని మాందాపూర్‌లో సర్వే నంబర్ 22 లోగల భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ మాందాపూర్‌లో సర్వే నంబర్ 22లో 188 మందికి 32 ఎకరాల భూమిని మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా పట్టాలు ఇచ్చారని, దీనికి పాస్‌బుక్‌లను కూడా పంపిణీ చేశారన్నారు. ప్రస్తుతం ఆ భూముల వివరాలు ధరణిలో తొలగించారని ఆరోపించారు. ఆ రోజు నుంచి రైతులు ఖాస్తులో ఉండి పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. ధరణిలో పేర్లు లేకపోవడంతో వారికి రైతుబంధు, రైతు బీమా, ఇతర ప్రభుత్వ సబ్సిడీలు అందడంలేదన్నారు. ఖాస్తులో ఉన్నవారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలని, లేనిపక్షంలో రైతులకు మద్దతుగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, ఉపాధ్యక్షుడు యాదవరెడ్డి, అమతమ్మ, సుశీల, చంద్రమ్మ, మాణెమ్మ, యాదయ్య, రాములు, కమలమ్మ, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మద్దతుగా ఆందోళన చేస్తున్న సాగర్

మైనార్టీల శ్మశానవాటికలకు 12 ఎకరాలు

పత్రాలు అందజేసిన మంత్రి హరీశ్ రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మైనార్టీల శ్మశాన వాటికల కోసం సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట శివారులోని 404 సర్వే నంబర్‌లో ఆరెకరాలు ముస్లిం శ్మశాన వాటికకు, మరో ఆరు ఎకరాలు క్రిస్టియన్ శ్మశాన వాటికకు కేటాయించారు. ముస్లిం శ్మశాన వాటిక భూ పత్రాలను ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ముస్లింలకు అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు భూములు కేటాయించామన్నారు. అలాగే ఆఖరి సఫర్, పరలోక యాత్ర వాహనాలను కూడా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ శరత్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పత్రాలను అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో చింతా ప్రభాకర్

హరితహారానికి స్థలాలను గుర్తించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఈ ఏడాది హరితహారం కార్యక్రమంలో 25 లక్షల మొక్కలు నాటడానికి స్థలాలను గుర్తించాలని, ఈ నెలాఖరులోగా అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అభివృద్ధి పనుల పురోగతి, హరితహారం, నర్సరీలు, కూలీల తరలింపు, ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, సీఎంఆర్ రైస్ డెలివరీ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను మరింత పెంచాలన్నారు. ఈనెల 20 నాటికి 24 మండలాల్లోని 639 గ్రామపంచాయతీలలో 92,264 మంది కూలీలు పనిచేస్తున్నారని, ప్రతీ గ్రామ పంచాయతీకి సరాసరిగా 144 మంది కూలీలు పనిచేస్తున్నట్లు తెలిపారు. మన ఊరు మనబడి పనులు పూర్తయిన వెంటనే నమోదు చేయాలన్నారు. పూర్తయిన పనులన్నింటికీ ఈనెల 29 లోగా నమోదు చేసి, ఎఫ్‌టీఓలను జనరేట్ చేయాలని ఆయా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఎస్‌డీఎఫ్‌లో చేపట్టిన పనులు, బీటీ రెన్యూవల్ పనుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేగవంతం చేయాలన్నారు. సీఎంఆర్ రైస్ డెలివరీ వంద శాతం పూర్తి కావాలని డీఎస్‌ఓకు స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీసీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీఎస్‌ఓ వనజాత, డీసీఓ ప్రసాద్, సివిల్ సప్లయ్ డీఎం సుగుణ భాయ్, డీపీఓ సురేశ్ మోహన్, వ్యవసాయ శాఖ జెడి నరసింహారావు, ఇంజనీరింగ్ శాఖల ఈ ఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

ఆదాయం పెంపునకు కృషి చేయాలి

ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం జ్యోత్స్న

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ ఆర్టీసీ సంస్థ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం జ్యోత్స్న అన్నారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఏప్రిల్ చాలెంజ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెలలో అధిక ఆదాయం వచ్చేందుకు కృషి చేసిన సిబ్బందిని డీఎం మల్లేశయ్యతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖేడ్ డిపో అధికారులు, కార్మికులు, సిబ్బంది కష్టపడుతుండటం వల్లే ఆదాయం పెరుగుతోందన్నారు. వచ్చే నెలలో వివాహాలు ఉండటంతో మరింత ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ నాగేందర్, చార్టెడ్ అకౌంటెంట్ వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు పాల్గొన్నారు.



సిబ్బందిని సన్మానిస్తున్న డీఎం మల్లేశయ్య

అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

190 కిలోల గంజాయి స్వాధీనం

రామచంద్రాపురం(పటాన్ చెరు): తూర్పుగోదావరి ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న ముఠాను శుక్రవారం రాత్రి రామచంద్రాపురం పోలీసులు, రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.48 లక్షల విలువైన 190 కిలోల గంజాయి, రెండు కార్లు, ఎనిమిది సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రధాన నిందితుడు ప్రకాశ్ దుర్యోధన్ మోహితేతో పాటు మరో షేక్ అజ్మల్, మొహ్మద్ అస్లాం, షేక్ నవీద్ కొంత కాలంగా ఒడిశా జిల్లా మల్కన్ గిరి నుంచి గంజాయిని సరఫరా చేస్తున్నారు. తొమ్మిది రోజుల క్రితం మహారాష్ట్రకు చెందిన కిషోర్ మోహితే, కిరణ్ జాదవ్, లాఖన్ జాదవ్, సంజీవ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు నుంచి మహారాష్ట్రలోని నాసిక్ కు గంజాయి సరఫరా చేస్తున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ప్రకాష్ దుర్యోధన్ ఈ పని చేస్తున్నారు. మాల్కన్ గిరి నుంచి గంజాయి సేకరించి అరకులోని కిషోర్ మోహితే ముఠాకు అప్పగిస్తారు. వారు అక్కడి నుంచి కారులో మహారాష్ట్రకు తరలించే ఒప్పందం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన రెండు మహీంద్రా కార్లకు ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ పేరిట నకిలీ నంబర్ ప్లేట్లతో గంజాయిని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఇక్రిశాట్ సమీపంలోని జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. రెండు కార్లను తనిఖీ చేయగా అసలు విషయం బయటపడింది. ప్రకాష్ దుర్యోధన్ మోహితే ముఠాను అదుపులో తీసుకోగా, కిషోర్ మోహితే ముఠా పరారీలో ఉంది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రపురం (పటాన్‌చెరు): ప్రతీ ఇంటికి రక్షిత తాగునీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్, ఉస్మాన్ నగర్ పరిధిలోని వార్డులలో మంచినీటి సమస్య పరిష్కారం కోసం రూ.25 కోట్ల వ్యయంతో 22 కిలోమీటర్ల మేరకు వేస్తున్న నూతన పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. తెల్లాపూర్, ఉస్మాన్ నగర్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. రూ.5 కోట్ల నిధులతో 40 లక్షల లీటర్ల సంపు, 20 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. పైపులైన్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రతీ ఇంటికి రక్షిత తాగునీటిని అందిస్తామని తెలిపారు. పనులు పూర్తయితే 1.27 లక్షల మందికి మంచినీటిని అందించడం సాధ్యమవుతుందన్నారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రణాళికలను రూపొందించి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం నారాయణ, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

కలెక్టర్‌కు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఉత్పత్తులు అందజేత



కలెక్టర్‌కు ఆయిల్ కేన్ అందిస్తున్న స్వయం సహాయక సంఘం మహిళలు

సంగారెడ్డి టౌన్: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘం, రైతులతో కలిసి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. శుక్రవారం కలెక్టర్ డాక్టర్ శరత్‌ను సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో రైతులు తయారుచేసిన కుసుమ నూనె, పెసరపప్పును డీఆర్డీఓ శ్రీనివాస్‌రావుతో కలిసి అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సీహెచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

ఝరాసంగం(జహీరాబాద్): జమ్ము కాశ్మీర్‌లోని పూంచ్ ఉగ్రవాది దాడిలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం నుంచి ప్రధాన రహదారి మీదుగా చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు శివశంకర్‌స్వామి, నాయకులు, వైదిక పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ

అమీన్‌పూర్‌కు కొత్త పిన్‌కోడ్ 502033

- కొత్త ఉప తపాలా కార్యాలయం ప్రారంభం
- కొత్త పిన్ కోడ్ ఉపయోగించాలన్న హైదరాబాద్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో కొత్తగా ఉప తపాలా కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. అలాగే కొత్త పిన్‌కోడ్‌ను అమీన్‌పూర్‌కు కేటాయించారని పోస్టల్ అధికారులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో కొత్త ఉప తపాల కార్యాలయాన్ని ఆ శాఖ హైదరాబాద్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలందరూ కొత్తగా కేటాయించిన పిన్‌కోడ్‌ను ఉపయోగించాలన్నారు. ఆధార్, బ్యాంకు చిరునామాల్లో కొత్త పిన్‌కోడ్ 502033 నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు అమీన్‌పూర్ ప్రాంతంలోని చిరునామాలకు 502032ని వాడుకునే వారని, ఇకపై కొత్త పిన్‌కోడ్ వినియోగించాలన్నారు. పోస్టల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ శాఖ ఈనెల 1 నుంచి కొత్త సేవింగ్స్ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. మహిళ సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి మాట్లాడుతూ కొత్త పోస్టాఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారులు కె.నరేంద్రబాబు, ఎస్‌వీఎల్ఎన్ రావు, కౌన్సిలర్ బి.కృష్ణ, ఆర్సీపురం ఇన్‌స్పెక్టర్ పోస్ట్స్ వి.రాహూల్ పాల్గొన్నారు.



అమీన్‌పూర్ సబ్‌పోస్టాఫీస్‌ను ప్రారంభిస్తున్న హైదరాబాద్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత

సురభి కెమికల్ అనుమతులు రద్దు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.సాయిలు
- 15వ రోజుకు చేరుకున్న ఆందోళన

హత్నూర(సంగారెడ్డి): సురభి కెమికల్ పరిశ్రమ అనుమతులు వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.సాయిలు డిమాండ్ చేశారు. హత్నూర మండలం వడ్డేపల్లి శివారులోని రసాయన పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా 15 రోజులుగా వడ్డేపల్లి, కోనంపేట, సాధునగర్, ఎల్లమ్మగుడి చింతల్ చెరువు, ముచ్చర్ల గ్రామాల రైతులు, ప్రజా ప్రతినిధులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కెమికల్ పరిశ్రమలకే వ్యతిరేకమన్నారు. రసాయన పరిశ్రమ ఏర్పాటుచేస్తే భూగర్భ జలాలు చెరువులు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని జిల్లా యంత్రాంగం సురభి రసాయన పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, తెలంగాణ జాగతి జిల్లా అధ్యక్షుడు దండు ప్రవీణ్ రావు, సీపీఎం నాయకులు శేఖర్, మహేందర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.సాయిలు

క్లుప్తంగా

భర్తతో గొడవపడి భార్య అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: భర్తతో గొడవపడి భార్య అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి చెప్పిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో నివాసం ఉంటున్న బస్వరాజ్ భార్య శశికళ ఇద్దరు గొడవపడ్డారు. దీంతో ఆమె గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి అదృశ్యంపై కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బిట్ కాయిన్ కోసం ఆరా మోసపోయిన మహిళ

రూ.1,20,000లు పోగొట్టుకున్న బాధితురాలు

సిద్దిపేటకమాన్: బిట్ కాయిన్ కోసం ఓ మహిళ ఆన్‌లైన్‌లో సైబర్ మోసానికి గురైన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన ఓ మహిళ గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి బిట్ కాయిన్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసింది. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసింది. గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాయమాటల్లో పడి బాధితురాలు ఆన్‌లైన్‌లో రూ.1,20,000లు పంపించింది. అనంతరం ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించింది. వెంటనే బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేసింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్: మండలంలోని మాడ్గి గ్రామానికి చెందిన రాంచందర్(55) కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గురువారం రాత్రి 10.30కు రాంచందర్ భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం జీవితంపై విరక్తి చెంది చున్నీతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దింపారు. గ్రామస్తుల సహాయంతో జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుడు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపాడు. కుమారుడు జీవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూరిగుడిసె దగ్ధం

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్‌లో పూరి గుడిసె దగ్ధమైంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పన్యాల శేఖర్ తన భార్య పిల్లలతో పూరిగుడిసెలో నివాసం ఉంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పూరి గుడిసెకు నిప్పు అంటుకుంది. ఈ ప్రమాదంలో గుడిసెలోని నిత్యావసర సరుకులతో పాటు, వంట సామగ్రి, బట్టలు, రూ.8,500లు కాలి బూడిదయ్యాయి. ఇంటికి నిప్పు అంటుకున్న సమయంలో శేఖర్‌తో పాటు అతని భార్య పద్మ పిల్లలు సాధిక, సుప్రియ, సుశాంత్, చరణ్ నిద్రలో ఉన్నారు. శేఖర్, పద్మలు అప్రమత్తమై వెంటనే బయటకు పరుగులు తీశారు. మంటలు ఆర్పేందుకు గ్రామస్తులు శ్రమించినప్పటికీ అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయింది. శేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వీడని అకాల వర్షం..

- గాలి దుమారంతో వాన
- పంటలకు నష్టం
- వరిచేలల్లో రాలిన గింజలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళనలో రైతులు

దుబ్బాకటౌన్: మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా తయారైంది రైతుల పరిస్థితి. సరిగ్గా వారం క్రితమే వడగండ్ల బీభత్సం. ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోకముందే అకాల వర్షం. శుక్రవారం తెల్లవారుజామున గాలిదుమారంతో వాన పడడంతో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులకు పుండు మీద కారం చల్లినట్లుగా తయారైంది వారి పరిస్థితి. గురువారం అర్ధరాత్రి నుంచే ఉరుములు..మెరుపులతో కూడిన గాలి దుమారం.

మధ్యరాత్రి 3 గంటలకు వాన పడింది. విపరీతంగా గాలిదుమారంతో వానపడడంతో కోతకొచ్చిన వరిచేలల్లో గింజలు రాలి పంటలకు నష్టం వాటిల్లింది. దుబ్బాకతో పాటు చెల్లాపూర్, మల్లాయపల్లి, బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, చీకోడ్, కమ్మరపల్లి, రాజక్కపేట, చేర్వాపూర్, లచ్చపేట ధర్మాజీపేట, రామక్కపేట గ్రామాల్లో గాలివానతో పంటలకు తీవ్ర నష్టం కలిగింది. ఇప్పటికే గత వారం రోజుల క్రితం వడగండ్ల వాన చెల్లాపూర్, మల్లాయపల్లి, బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ గ్రామాలతో పాటు దుబ్బాక పట్టణంలో వరిపంటలు 90 శాతంకు పైగా నష్టం వాటిల్లింది.

కుప్పల్లో చేరిన నీరు

అకాల వర్షంతో దుబ్బాక మార్కెట్ యార్డుతో పాటు చెల్లాపూర్‌లో వరికోసి ఆరబెట్టేందుకు



దుబ్బాకలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం

కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాని ఆరబెట్టేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కుప్పల క్రింది నుంచి నీళ్ల పోవడంతో ధాన్యాన్ని మళ్లీ వేరేచోటకు రైతులు ఎత్తిపోయాల్సిన పరిస్థితి దాపురించింది. కోసిన ధాన్యం అకాల వర్షంతో తడిసి ముద్దవ్వగా, వరికోతలు సాగని పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు వెంటాడుతున్న అకాల వర్షం..మరోవైపు పంట చేతికొస్తుందో రాదోనని రైతులు అయోమయం చెందుతున్నారు. గాలివానకు చెల్లాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఇండ్ల రేకులు, పశువుల షెడ్లు సైతం ధ్వంసం అయ్యాయి.



చెల్లాపూర్‌లో గాలివానకు కూలిన పశువుల కొట్టం

ఆరబెట్టిన ధాన్యం తడిసింది

రెండు రోజుల క్రిందటనే 8 ఎకరాల్లో వరిపంట కోసి మార్కెట్‌లో పోసిన. అర్ధరాత్రి తరువాత ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గాలివాన పడడంతో మార్కెట్‌లో పోసినధాన్యం తడిసింది. ఎండబోసిన వడ్లు కూడా తడిశాయి. నా కుప్పల క్రింద నుంచి నీళ్ల పోయినయి.

–కేసుగారి స్వామి, రైతు, దుబ్బాక



పశువులపై చిరుత దాడి

లేగ దూడ మృతి

కల్హేర్(నారాయణఖేడ్): పశువులపై చిరుత దాడి చేసిన ఘటనలో లేగ దూడ మృతి చెందిన ఘటన రాపర్తి శివారులో జరిగింది. స్థానికులు, ఉరటి సాయిలు (రైతు) చెప్పిన వివరాల ప్రకారం..గురువారం రాత్రి మండలంలోని రాపర్తి శివారులో చిరుత పులి ప్రత్యక్షమైంది. ఉరటి సాయిలుకు చెందిన పశువులపై చిరుత పులి దాడి చేసింది. ఈ ఘటనలో లేగదూడ హతమైనట్లు ఆయన పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్రావణ్‌కుమార్, అటవీ శాఖ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత కొంత కాలంగా అటవీ ప్రాంతాంలో చిరుత పులి సంచరిస్తుండడంతో కల్హేర్, సిర్గాపూర్ మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కడ్పల్ శివారులో అడవిలో కెమెరాలు ఏర్పాటు చేయడంతో అప్పట్లో చిరుత పులి తిరుగుతున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. దీంతో అక్కడ చిరుత పులి ఉందనే విషయన్ని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. కడ్పల్, ఖాజపూర్, ఖానాపూర్(కె), నాగధర్, రాపర్తి, కృష్ణాపూర్, సంజీవన్‌రావుపేట చుట్టూ అటవి ప్రదేశం ఉండడంతో చిరుత సంచరిస్తుంది. ఈ క్రమంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని, తమతో పాటు పశువులకు రక్షణ కల్పించాలని వారు అటవీ అధికారులను కోరుతున్నారు. నష్టపోయిన సాయిలును ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకొంటున్నాడు.



మృతి చెందిన లేగ దూడ

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు, పురుగుల మందు తాగి ఇంకొకరు మృతి చెందారు.



బాల్‌రెడ్డి (ఫైల్)

దుబ్బాక: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతున్న..వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం దౌల్తాబాద్ ఎస్‌ఐ చైతన్య రెడ్డి వివరాల ప్రకారం..రాయపోల్ మండలం తిమ్మక్కపల్లికి చెందిన కర్ణంపల్లి బాల్‌రెడ్డి(45) ఈ నెల 14వ తేదీన పని నిమిత్తం దుబ్బాక నుంచి తిరిగి వెళ్తున్న క్రమంలో బైక్‌ను వేగంగా నడపడంతో దొమ్మాట గ్రామ శివారులో రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాల్‌రెడ్డిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాల్‌రెడ్డి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు దశ్మంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆరుట్ల ప్రసాద్(33) ప్రైవేటు జాబ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్దిరోజులుగా మద్యానికి బానిసైన ప్రసాద్ ఈ నెల 16వ తేదీ రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చిన అనంతరం భార్య రమ్యతో గొడవపడ్డాడు. విషయం తెలుసుకొని తల్లిదండ్రులు మందలించారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సనిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం నిర్వహిస్తుండగా శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

రామాయంపేట(మెదక్): అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని 60ఏళ్ల వృద్ధుని మృతదేహం శుక్రవారం రైల్వే పోలీసులకు లభ్యమైంది. కామారెడ్డి రైల్వే హెడ్ కానిస్టేబుల్ జశ్వంత్‌సింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలిని ఆయన సందర్శించారు. అక్కడ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై వృద్ధుడి మృతదేహాన్ని చూశారు. గుర్తు తెలియని వృద్ధుడిగా కేసు నమోదు చేసినట్లు రైల్వే కానిస్టేబుల్ జశ్వంత్‌సింగ్ తెలిపారు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



వృద్ధుడి మృతదేహం

చేపలవేటకు వెళ్లి వ్యక్తి..

చిన్నశంకరంపేట(మెదక్): చేపలవేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం..శుక్రవారం మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన తలారి సత్తయ్య(56) గ్రామశివారులోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వల కాళ్లకు చుట్టుకొని ఈత కొట్టలేక ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. రోజూ మాదిరిగానే తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లి తెల్లారేసరికి ఇంటికి వచ్చే భర్త ఎంతకూ రాకపోవడంతో అతని భార్య లక్ష్మి, అల్లుడు రవి చెరువు వద్దకు వెళ్లి చూశారు. అక్కడ చెరువులో చేపలవలకు చుట్టుకొని నీటిలో మునిగి ఉన్నట్టు కన్పించాడు. వెంటనే చెరువులోకి వెళ్లి సత్తయ్యను రక్షించేందుకు ప్రయత్నించగా అతను అప్పటికే చనిపోయినట్లు గ్రహించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.



సత్తయ్య మృతదేహం

కారు ఢీ కొని లారీ డ్రైవర్..

కొండపాక(గజ్వేల్): కారు ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ ఒర్సు మల్లేష్(46) అక్కడిక్కడే మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకులారీ నడుపుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్రైవరు టీ తాగేందుకు తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో ఓ హోటల్ వద్ద లారీనీ నిలిపి అవతలి వైపునకు వెళ్లాడు. తిరిగి లారీ వద్దకు వస్తూ డివైడర్‌ను దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెలుతున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవరు దినేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటా హుటీన సంఘటనా స్థలానికి చేరుకొని కారు డ్రైవరును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవరు దినేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు.



ఓర్సు మల్లేశ్ (ఫైల్)

అస్థికలు కలిపేందుకు వెళుతుండగా..



బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ పగిల్ల ఎల్లయ్య



ప్రమాద బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యాలు

- జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం
- డ్రైవర్ మృతి.. 25 మందికి తీవ్రగాయాలు
- 15 మంది పరిస్థితి విషమం

వెల్గటూర్, గజ్వేల్: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ప్రైవేట్ బస్సు డ్రైవర్ పగిల్ల మల్లయ్య(50) దుర్మరణం చెందగా, మరో 25మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో 15మంది పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన ఆకుల దేవేందర్ తల్లి ఆకుల అనసూయ ఇటీవల మరణించింది. ఆమె అస్థికలు జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరి నదిలో కలపడానికి ప్రైవేట్ బస్సులో శుక్రవారం ఉదయం బయలు దేరారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన 25 మంది ఉన్నారు. బస్సు కొత్తపేట గ్రామం వద్దకు చేరింది. అక్కడ రోడ్డుపై పడిఉన్న చెట్టును తప్పించబోయింది. అదేసమయంలో రాయపట్నం నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ వేగంగా రావడంతో బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ పగిల్ల ఎల్లయ్య క్యాబిన్‌లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒకేకుటుంబానికి చెందిన ఆకుల మంగమ్మ, మౌనిక, శ్రీనివాస్, వెంకటేశం, యాదగిరి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, దినేశ్, భాగ్యలక్ష్మి, సుభద్ర, అక్షర, మయాన్ని, మానస, కనకయ్య సహా సుమారు 25 మంది గాయపడ్డారు. 15 మంది కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ పగిల్ల ఎల్లయ్యను జేసీబీ సాయంతో శ్రమించి బయటకు తీశారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడ్డ మిగతావారిని కరీంనగర్, జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారిలో 15మంది పరిస్థితి విషమంగా ఉంది.

చెట్టుకొమ్మను తప్పించబోయి..

వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలులు వీచాయి. వీటిధాటికి చెట్టుకొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. సాయంత్రం వరకూ వాటిని ఎవరూ తొలగించలేదు. అయితే, ఈ చెట్టుకొమ్మలను తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్ అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో 15కిలోమీటర్ల దూరంలో ధర్మపురికి చేరుకునేలోపే రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన బెజుగామ గ్రామంతో పాటు గజ్వేల్ పట్టణంలో విషాదాన్ని నింపింది.

భర్త ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): భార్య పుట్టింటి నుంచి రావడంలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చందాయిపేటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన అవబోతు గణేశ్(30)కు అదే గ్రామానికి చెందిన సౌజన్యతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నాలుగు నెలల క్రితం సౌజన్యకు శస్త్ర చికిత్స చేయించగా అదే గ్రామంలోని తన పుట్టింట్లో ఉంటుంది. గణేశ్ సౌజన్యను తమ ఇంటికి రావాలని ఇటీవల భార్యతో గొడవ పడుతుండేవాడు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోక పోవడంతో మద్యం సేవించి ఓ తోటలో ఉరి వేసుకొని మృతి చెందాడు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): నందికంది జాతీయ రహదారిపై లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు చిన్నారులు గురువారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాద స్థలాన్ని శుక్రవారం సంగారెడ్డి డీఎస్పీ రవీంద్ర రెడ్డి పరిశీలించారు. ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన అండర్ పాస్ నిర్మాణాన్ని చేపట్టాలని సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ సునీల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. వేగంగా వెళ్తున్న వాహనాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తగిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్ కుమార్, ఎల్ అండ్ టి అధికారులు పాల్గొన్నారు.

చిన్నారి రిహన్ అంత్యక్రియలు పూర్తి

గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి రిహన్(12) అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించారు. మరో చిన్నారి సక్లయిన్(8) మృతదేహాన్ని బీహార్‌లోని వారి స్వగ్రామానికి అంబులెన్స్‌లో తరలించారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశానికి ప్రమాదం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఎ రహమాన్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అదానీ, అంబానీ లకు కట్టబెడుతూ, మతరాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వం దేశానికి ప్రమాదకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ రహమాన్, పట్టణ కార్యదర్శి వి. వినోద పేర్కొన్నారు. బీజేపీ హటావో దేశ్ కో బచావో నినాదంతో సీపీఐ కేంద్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటులో ప్రభుత్వానికి వ్యతిరేఖంగా మాట్లాడిన వారిపై సీబీఐ, ఈడీ దాడులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగం బాగా పెరిగిపోయిందని అన్ని రంగాల్లో దేశం వెనక్కి నెట్టబడిందన్నారు. ఈ కార్యక్రమంలో తాజుద్దీన్, ముస్తాఫా, ఎం .రమేశ్, సాదిక్అలీ, దత్తుస్వామి, రాజు, యాకుబ్అలీ, పూలమ్మ, లక్ష్మి, అనసుజా తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



పేకాట స్థావరం నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు



నగదు, సెల్ ఫోన్లు

- 6 బైకులు, 6 సెల్ ఫోన్లు, రూ.33,700లు స్వాధీనం
- ఆరుగురిపై కేసు నమోదు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న స్థావరంపై శుక్రవారం టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6 బైక్‌లు, ఆరు సెల్ ఫోన్లతో పాటు, రూ.33,700లు స్వాధీనం చేసుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాలు, ఇండ్లు, ఫాంహౌస్‌ల్లో పేకాట, జూదం ఆడినా, మరే ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడినట్లు గమనిస్తే డయల్ 100 లేదా, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూం నెంబర్ 8712667100కు సమాచారం అందించాలని కోరారు. పేకాట, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలోని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ కార్యాలయంపై దాడికి యత్నించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఫౌండేషన్ అధ్యక్షుడు చక్రధర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ కార్యాలయ వాచ్‌మెన్‌పై గురువారం రాత్రి గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు దాడికి యత్నించారని ఆరోపించారు. కార్యాలయంకు నిప్పు పెట్టి కాలుస్తామని బెదిరించినట్లు వారు తెలిపారు. కౌలు రైతుల కోసం ఏర్పాటు చేసిన వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు మూత్ర విసర్జన చేశారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని వారో కోరారు. తమకు, కార్యాలయానికి పోలీసులు భద్రత కల్పించాలన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో కస్తూరి హరీశ్, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చక్రధర్‌గౌడ్

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత

సిద్దిపేటకమాన్: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సిబ్బందికి సూచించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సెక్షన్ ఇన్‌చార్జి, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందికి ఎమర్జెన్సీ కమ్యూనికేషన్ ప్లాన్, కమ్యూనికేషన్ వ్యవస్థ గురించి సీపీ కార్యాలయంలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పోలీస్ స్టేషన్‌కు రాత్రి సమయాల్లో ఏదైనా ముఖ్యమైన ఫోన్ కాల్ వస్తే సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జి ఉన్నతాధికారులకు, ఎస్‌బి కంట్రోల్ రూం, పోలీసు కంట్రోల్ రూంకు తెలియపర్చాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లకు నూతన మొబైల్ ఫోన్లు, నూతన నెంబర్లు ఇచ్చారన్నారు. వాటిని సెక్షన్ ఇన్‌చార్జి దగ్గర మాత్రమే ఉంచాలని తెలిపారు. విధినిర్వహణలో ఉన్న అధికారుల వద్ద మాత్రమే ఈ ఫోన్ ఉండాలని సీపీ సూచించారు. రాత్రి సమయాల్లో విహెచ్‌ఎఫ్ సెట్, మొబైల్ ఫోన్‌లో ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సెక్షన్ ఇన్‌చార్జి కంట్రోల్ రూమ్ నుంచి విహెచ్‌ఎఫ్ సెట్, ఫోన్‌లో కానీ స్పందించకపోతే కంట్రోల్ రూంలో ఉండే సిబ్బంది వెంటనే అధికారులకు తెలపాలని సూచించారు. డయల్ 100కాల్ సెక్షన్ ఇన్‌చార్జికి రాగానే సంబంధిత బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బందికి సమాచారం చేరవేయాలన్నారు. ఐదు నుంచి పది నిమిషాల్లోపే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థపై సీసీఆర్‌బి అధికారి చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శ్వేత